క్లుప్తంగా

జేకే-5 ఉద్యోగులకు అభినందన



అధికారులను అభినందిస్తున్న జీఎం వీసం కృష్ణయ్య

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా జేకే-5 సింగరేణి ఉద్యోగులను ఏరియా జీఎం వీసం కృష్ణయ్య అభినందించారు. శనివారం తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఇటీవల జేకే-5 ఓసీకి 5 స్టార్ రేటింగ్ వచ్చిందున ప్రాజెక్టు ఆఫీసర్ కృష్ణమోహన్, ఉద్యోగులను అభినందించారు. మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో బొగ్గు ఉత్పత్తి కంపెనీలలో ప్రమాదరహిత గనులకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారు ప్రతీ ఏడాది ఇచ్చే అవార్డులు ఈ ఏడాది ఇల్లెందు జేకే -5 ఓసీకి లభించటం అభినందనీయం అన్నారు. భవిష్యత్‌లో కూడా ఇదే ఒరవడిని కొనసాగిస్తూ నూతన ఓసీలో బొగ్గు ఉత్పత్తి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, డీజీఎం పర్సనల్ తుకారం, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

టేకులపల్లి: టేకులపల్లి మండలం సిద్దారం, సంపత్‌నగర్ గ్రామాల్లో పత్తి పంటను ధ్వంసం చేసిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మాచారి, డివిజన్ నాయకుడు జరుపుల సుందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టేకులపల్లి మండలం సంపత్ నగర్, సిద్దారంలో అధికారులు ధ్వంసం చేసిన పంటను, ఆయా రైతులను శనివారం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇద్దరు రైతులకు చెందిన ఆరు ఎకరాల భూమిలో చేతికొచ్చిన పత్తి పంటను ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేయడం దారుణమని, ఆరుగాలం కష్టపడి పెట్టుబడి పెట్టి రైతుల అప్పుల పాలై ఇబ్బందులు పడుతూ ఉంటే ఫారెస్ట్ అధికారులు మానవత్వం లేకుండా చేతికి వచ్చిన పంటను ధ్వంసం చేయటం సరికాదని వాపోయారు. పంటకు, ఎకరానికి రూ.70,000 నష్టపరిహారం ఇవ్వాలని, పంట ధ్వంసం చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కేసు నమోదు

ఇల్లెందు: తనపై కొందరు దాడి చేశారని ఇందిరానగర్ చెందిన వల్లపు సమ్మయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గణేష్ నిమజ్జనంలో చోటుచేసుకున్న వివాదం సద్దుమణిగేలా చేసినందుకు కోపంతో మరుసటి రోజు వినోద్ ఇంటికి వచ్చి అసభ్యంగా మాట్లాడాడని సమ్మయ్య ఫిర్యాదులో పేర్కొన్నాడు. విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి ప్రశ్నిస్తున్న సమయంలో వినోద్, భాస్కర్, విజయలక్ష్మి కర్రలతో దాడి చేశారని, స్పృహ తప్పి పడిపోయిన తనను స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారని వివరించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


డైరెక్టర్ తిరుమలరావుకు సన్మానం



డైరెక్టర్ ఈఅండ్‌ఎంను సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్ ఈఅండ్‌ఎం మోకాళ్ల తిరుమలరావును శనివారం ఆయన చాంబర్‌లో సింగరేణి బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ లైజన్ ఆఫీసర్, డీజీఎం వేముల మురళి, అధ్యక్షుడు అమిరిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వెన్నం వెంకటేశ్వరరావు, నల్లపూరి రమేష్, కేవీ ప్రసాద్, వెంకటస్వామి, చింతకింది శ్రీనివాస్, శంకర్, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, వెంకట రమణ, వేణు, చందర్, శ్రవణ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు..



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ఉపాధ్యాయులకు శనివారం సన్మానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో నగేష్, పితాని సత్యనారాయణ, శ్రావణ్‌కుమార్, ఫణికుమార్, రమేష్, రమాదేవి, నీలోఫర్, అంజయ్య, రాజయ్య, జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి ఘనంగా వీడ్కోలు

కనుల పండువగా ఊరేగింపు, శోభాయాత్ర | అన్నదానాలు, తాగునీరు, మజ్జిగ పంపిణీ | పోలీసుల భారీ బందోబస్తు



ఇల్లెందు: శోభాయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథునికి శనివారం భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆనందోత్సాహాల నడుమ డప్పు చప్పుళ్లు, బ్యాండ్ మేళాలు, పాటలు, నృత్యాలు, కోలాటాల నడుమ చిన్నాపెద్ద, యువత గణపతి బప్పా మోరియా.. జై బోలో గణేష్ మహరాజ్‌కి జై.. అంటూ లంబోధరుడిని గంగమ్మ ఒడికి చేర్చారు. పలుచోట్ల స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు తాగునీరు, మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శోభాయాత్రను ఎమ్మెల్యే, ఎస్పీలు ప్రారంభించగా నిమజ్జనం వరకు పోలీస్, రెవెన్యూ, కార్పొరేషన్, విద్యుత్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు పర్యవేక్షించారు. విగ్రహాలను సమీపంలోని చెరువులు, కాలువలు, వాగుల్లో నిమజ్జనం చేయగా పలు విగ్రహాలను భద్రాచలం గోదావరి నదికి తరలించారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంలో భారీ వినాయక విగ్రహం



కొత్తగూడెంటౌన్: శోభాయాత్రలో గణేష్ విగ్రహం



భద్రాచలం వెళ్తున్న విగ్రహాలు



జూలూరుపాడు: పడమటనర్సాపురంలో..



పాల్వంచరూరల్: పాండురంగాపురంలో





టేకులపల్లి: కుప్పస్వామి కాలనీలో కోలాటమాడుతున్న మహిళలు, యువకుల జోష్



జూలూరుపాడు: అనంతారంలో అన్నదానం



పాల్వంచ: నిమజ్జనానికి వెళ్తున్న వినాయకుడు



గణేష్ ఊరేగింపులో కళాకారుల ప్రదర్శన

కలెక్టరేట్ ఎదుట ఏఈఓల నిరసన



నిరసన తెలుపుతున్న ఏఈఓలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వ్యవసాయ విస్తరణాధికారులపై పనిభారం తగ్గించాలని, పని ఒత్తిడితో మరణించిన కామారెడ్డి జిల్లా దొంగ్లి మండలం సీతంపేట క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారి సత్పల్లి బస్వరాజ్ పటేల్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా ఏఈఓల సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి డీఏఓ బాబూరావుకు వినతిపత్రం అందజేశారు. అధ్యక్షుడు బందెల నరసింహారావు మాట్లాడుతూ పనిభారంతో ఏఈఓలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదువేల ఎకరాల కంటే ఎక్కువగా ఉన్న క్లస్టర్‌ను గుర్తించి నూతన క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ఉద్యోగులను నియమించాలన్నారు. ఏఈఓలు గ్రామాల వారీగా అనేక సమస్యలతో డిజిటల్ క్రాప్ సర్వే చేస్తున్నారని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సందీప్, రవీందర్‌రావు, గౌస్, షకీరాభాను, జేవీడీ ప్రసాద్, గోపీకృష్ణ, పవన్, శరత్ చంద్ర, ప్రవీణ్, యశ్వంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): 13న జిల్లా కేంద్రంలోని శేషగిరిభవన్‌లో జరగనున్న మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రెండో జిల్లా మహాసభల కరపత్రాలను శనివారం స్థానిక శేషగిరిభవన్‌లో ఆవిష్కరించారు. బూర్గంపాడు మండల యూనియన్ కమిటీ సమావేశం యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. మాట్లాడుతూ జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రూ.10వేల వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిల్లులు ప్రతీనెల చెల్లించాలని కోరారు. కోడిగుడ్లు, వంటగ్యాస్ ప్రభుత్వమే సమకూర్చాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మహాసభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బుజ్జమ్మ, ఆకుల పద్మ, వెంకటలక్ష్మి, చిలకమ్మ రాధ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమతోనే సింగరేణికి లాభాలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: సింగరేణి లాభాలలో కాంట్రాక్టు కార్మికులకు రూ.20 వేలు ఇవ్వాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఎస్కే యాకూబ్‌షావలీ, ఎస్ఏ నబీ, రామ్‌సింగ్ డిమాండ్ చేశారు. శనివారం టేకులపల్లి సింగరేణి కాలనీ, పీఓ కార్యాలయం, మస్టర్ అడ్డాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈనెల 12 కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే చలో ప్రజాభవన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఒక పర్మనెంట్ కార్మికుడికి ఇచ్చే జీతంతో 10 మంది కాంట్రాక్టు కార్మికులతో పని చేయించుకుంటున్నారని తక్కువ వేతనాలు ఇవ్వడం వల్లనే సింగరేణికి లాభాలు వస్తున్నట్లు చెప్పారు. ఈ లాభాలలో గతేడాది రూ.5000 మాత్రమే కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చారని, ఈసారి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 12 ఏళ్లుగా కార్మికుల వేతనాలు పెంచలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే జీతాలు పెంచుతామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, 20 నెలలు దాటినా అమలు కాలేదని విమర్శించారు. ఈ హామీల అమలుకు ఈ నెల 12న హైదరాబాద్‌లోని చలో ప్రజాభవన్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జరుపుల సుందర్, కుడుదుల వీరన్న, రామ్‌కుమార్, బాలు, శివయ్య, షఫీ, నాగమణి, ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు అన్యాయం జరుగుతోంది..



నినాదాలు చేస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: ఎస్టీ రిజర్వేషన్లతో ఆదివాసీ గిరిజనులకు అన్యాయం జరుగుతోందని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు సనప కోటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి పంచాయతీలోని కుమురం భీమ్ హాల్‌లో శనివారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ)ఆధ్వర్యంలో జిల్లా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ లంబాడీలు గిరిజనులు కారని, ఎలాంటి చట్టబద్ధత లేదని ఎస్టీ జాబితాలో కొనసాగుతూ ఆదివాసీ రిజర్వేషన్లను అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో బచ్చలి వెంకటేశ్వర్లు, దారబోయిన రమేష్, కల్తీ రాంప్రసాద్, తంబళ్ల రవి, పాయం నర్సింహారావు, ఈసాల రాంబాబు, తాటి రామారావు, ఈసం భాస్కర్, సోయం సత్యనారాయణ, ఆళ్ల సుజాత, కారం రత్నకుమారి, ఇరుప రామారావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచరూరల్: మండల పరిధి పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 22నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్న దసరా ఉత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఆసక్తి కలిగిన కళాకారులు దరఖాస్తులు చేసుకునేందుకు మరో రెండు రోజులు గడువు పొడిగించినట్లు 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఈఓ ఎస్.రజనీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం, హైదరాబాద్ శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుబజార్ సమీపంలోని పోచమ్మ తల్లి టెంపుల్ కూలీలైన్‌లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు జిరాక్స్ తెచ్చుకోవాలని తెలిపారు.

గురుకుల కళాశాల వర్కర్ల వేతనం పెంచాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వర్కర్లు

ఇల్లెందురూరల్: గిరిజన గురుకుల కళాశాల హాస్టల్ ఔట్ సోర్సింగ్ వర్కర్ల వేతనం పెంపు కోరుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఏటీడీఓ కార్యాలయంలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత తాళ్లూరి కృష్ణ మాట్లాడుతూ.. వర్కర్లకు పది నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, క్యాటరింగ్ విధానం రద్దు చేయాలని, జీఓ 60 ప్రకారం రూ.15,600 వేతనం ఇవ్వాలని, వేతనంతో కూడిన సెలవులు ప్రకటించాలని, గుర్తింపు కార్డులు, యూనిఫాం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే కళాశాల ఎదుట దీక్ష చేపడతామని హెచ్చరించారు. కుంజ జయ, ఈసం కవిత, ఈసం విజయ, సరోజ పాల్గొన్నారు.

వంటగ్యాస్ వాడకంపై అవగాహన

పాల్వంచరూరల్: కిన్నెరసాని గ్రామంలో శనివారం వంటగ్యాస్ వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించారు. పౌరసరఫరాల సంస్థ నవభారత్ హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ, మెకానిక్ ప్రకాశ్, డెలివరీ బోయ్స్‌తో కలిసి ప్రమాదాల జరగకుండా పాటించాల్సిన జాగ్రత్తలను సూచించారు. ప్రమాదం జరిగితే పాటించాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అచ్చా శ్రీనివాసరావు, శోభారాణి, స్థానికులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చే సాధనలో భాగంగా శనివారం కొత్తగూడెం ఏరియా పీవీకే-5 ఇంక్లైన్ గని ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు 30, 35 సంవత్సరాలు సంస్థలో పనిచేసి రిటైర్డ్‌మెంట్ అనంతరం వచ్చిన సొమ్ము ఇంటికి వెచ్చిస్తే చేతిలో చిల్లిగవ్వ లేక చాలీచాలని పెన్షన్‌పై ఆధారపడి దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సర్వీసు కాలంలో పిల్లలకు అధిక మొత్తం ఖర్చు ఇతరత్రా కుటుంబ బాధ్యతలకు సరిపోయే పరిస్థితుల్లో, ఆ ఆదాయం సొంతింటి కలకు ఖర్చు చేయాల్సి వస్తున్న నేపథ్యంలో సింగరేణి వ్యాప్తంగా 11, 12 తేదీలలో కార్మికుల అభిప్రాయ సేకరణ కొరకు బ్యాలెట్ ఓటింగ్ చేపట్టిందని, సొంత ఇల్లే కావాలా, కంపెనీ క్వార్టర్ కావాలో కార్మికుల అభిప్రాయం తెలుసుకునే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మధు, సంపత్, ధర్మా, కోటయ్య, రమణ, పాషా, వెంకటేశ్వర్లు, రమేష్, అరుణ్, దుర్గాప్రసాద్, రాంబాబు, హరీష్, రాజ్‌కుమార్, మధుసూదన్, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె రహదారులకు 'కొత్తగూడెం' ఆదర్శం

సూపర్‌బజార్(కొత్తగూడెం): పల్లె రహదారులను అభివృద్ధి చేయడంలో, ప్రజలకు కనీస సౌకర్యాల కల్పనలో కొత్తగూడెం నియోజకవర్గం ఆదర్శమని, వివిధ పథకాలలో మంజూరైన నిధులతో ఇప్పటికే గ్రామీణ అనుసంధాన రోడ్లు, ప్రధాన రహదారులు పూర్తి చేశామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ రహదారులు, పట్టణ అంతర్గత రహదారులు, వంతెనల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ ద్వారా నియోజకవర్గంలో ఐదు హైలెవెల్ వంతెనలు, 5.90 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు లభించాయని తెలిపారు. దీని కోసం రూ.16.05 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈనిధులతో లక్ష్మీదేవిపల్లి మండలం పెద్దతండా – మాన్యతండా మధ్య రూ.1.80 కోట్లతో హైలెవెల్ వంతెన, హేమచంద్రాపురం –అనిశెట్టిపల్లి వరకు రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డు, హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం, పాతకొత్తగూడెం – బైపాస్ పెనుబల్లి మధ్య హైలెవెల్ వంతెన, సుజాతనగర్ మండలం సీతంపేట – అంజనాపురం వరకు 1.20 కి.మీ. బీటీ రోడ్డు, హైలెవెల్ వంతెన నిర్మాణం చేపడతామని వివరించారు. ఎస్కే సాబీర్‌పాషా, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, వంగా వెంకట్, జి.వీరస్వామి పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా మీడియా




సాక్షి బ్యూరో కృష్ణ గోవింద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. జర్నలిస్టు డేను పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్‌పాషాతో కలిసి కేక్ కట్ చేసి పలువురు జర్నలిస్టులను సత్కరించారు. మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తి ఎంతో విలువతో కూడుకున్నదన్నారు. ప్రభుత్వ పాలనలో లోటుపాట్లు జరిగినపుడు, అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడినపుడు, దోపిడీ పెరిగినప్పుడు జర్నలిస్టులు వాటిపై అక్షర యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవస్థను, వ్యక్తులను గాడిలో పెట్టేందుకు కృషి చేయాలని సూచించారు. మారుతున్న కాలానుగుణంగా జర్నలిస్టు వృత్తిలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని వృత్తి నియమాలను పాటిస్తూ విషయ పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంచుకుంటూ నైపుణ్యతను ప్రదర్శించాలని పేర్కొన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి జర్నలిస్టులు సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఎంతోకాలంగా విలేకరులు ఎదురుచూస్తున్న ఇళ్లస్థలాల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

నాగాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కృష్ణ గోవింద్, సతీష్, నవీన్, మోటమర్రి రామకృష్ణ, జునుమాల రమేష్, పండా సత్యానంద్, కాగితపు వెంకటేశ్వరరావు, కళ్లోజి శ్రీనివాసరావు, లక్ష్మణ్, షఫీ, దాసరి వెంకటేశ్వరరావు, శశి, నరసింహారావు, రాజేష్, ఈశ్వర్, అశోక్, శేఖర్, రాము, అనుపమ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్టూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి..



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఇఫ్టూ అనుబంధ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, స్కీం వర్కర్ల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఇఫ్టూ ఇల్లెందు ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు రావూరి ఉపేందర్, మోహన్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, పని స్థలాల్లో కార్మికులకు రక్షణ కల్పించాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల అక్రమాలపై విచారణ జరపాలి

జూలూరుపాడు: కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ శనివారం డీపీఓ చంద్రమౌళికి భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలో జనవరి 2020 నుంచి జనవరి 2025 వరకు జరిగిన పనుల బిల్లులు, ఓచర్లు, చెక్కులు, ఎంబీ ఎస్టిమేషన్‌కు అన్ని ఆధారాలను సమర్పించడం జరిగిందని చెప్పారు. రూ.5 వేలు మించి చెక్కులు డ్రా చేయకూడదనే నిబంధనను అతిక్రమించి నిధులు డ్రా చేసినట్లు చెప్పారు.

జీపీ తీర్మానం రికార్డు బుక్‌లో ఖర్చులు సరిగా రాయకుండా తప్పుడు బిల్లులు పెట్టి డబ్బులు అక్రమంగా డ్రా చేశారని ఆరోపించారు. జీపీ నిధులు దుర్వినియోగం, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డీపీఓను కోరారు.

అగమ్య గోచరంగా అంగన్‌వాడీ కేంద్రం



గేటు లేని కోక్యాతండా అంగన్‌వాడీ కేంద్రం



చేతిపంపు కంటే ఎత్తులో ఉన్న ఇంకుడుగుంత

టేకులపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలు ఐదేళ్ల నాలుగేళ్లలోపు చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందిస్తుంటాయి. వీరందరికీ అనుకూలమైన, ఆహ్లాదకరమైన వాతావరణం, ఆవరణ అంగన్‌వాడీ కేంద్రంలో ఉంటాయి. టేకులపల్లి మండలం తడికలపూడి పంచాయతీ కోక్యాతండా అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, ఆయా ఇద్దరు ఉన్నారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులు ఉన్నారు. భవనం ఉంది. అవసరమైన సామగ్రి ఉంది. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందిస్తూ చిన్నారులకు విద్యా బుద్ధులు కూడా నేర్పిస్తున్నారు.

కానీ ఈ కేంద్రంలో ఆహ్లాదం, కేంద్రానికి రక్షణ కరువైంది. గతంలో 'సాక్షి'లో వరుస కథనాలతో ఈ అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ, మరుగుదొడ్డి, బోరింగ్ వద్ద ఇంకుడు గుంత మంజూరైంది. మరుగుదొడ్డి నిర్మించారు కానీ, పైన రేకులు, తలుపులు అమర్చడం మరిచిపోయారు. ప్రహరీ నిర్మించారు కానీ గేటు మరిచారు. ఊరికి చివర ఉండటంతో కేంద్రానికి రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మట్టి పోసి చదును కూడా చేయాల్సి ఉంది. అదేవిధంగా కేంద్రం ముందు, పక్కన పిచ్చి మొక్కలు, పొదలు ఉండటంతో పాముల భయం నెలకొంది. మురుగు నీరు పారుదలకు కాలువ కూడా ఏర్పాటు చేయాలి.

ఇంకుడుగుంతల నిర్మాణంలో లోపాలు..

ఈ అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న బోరింగ్ వద్ద నిర్మించిన ఇంకుడుగుంతను చూసి స్థానికులు నవ్వుకుంటున్నారు. బోరింగ్ వద్ద వాడిన నీరు నేరుగా వెళ్లి ఇంకుడు గుంతలో పడాలి. అధికారుల అత్యుత్సాహం, నిర్లక్ష్యం కారణంగా అడ్డగోలుగా ఇంకుడు గుంతను నిర్మించారు. పంపు నుంచి ఇంకుడు గుంత లోతట్టుగా ఉండాలి. కానీ ఇక్కడ బోరింగ్ కంటే ఇంకుడు గుంత ఎత్తుగా నిర్మించడం విశేషం. ఉన్నతాధికారులు స్పందించి ఈ కేంద్రంలో అడ్డగోలు నిర్మాణంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.